

# సంధ్యారాగం

— ఉషారాణి భాటియా

కావేరి సోఫా మూలకి జరిగింది. టెలిఫోన్లో మాట్లాడిన తర్వాత, మనసు స్థిమితపడి, లేచి నిలబడింది. "ఒరేయ్ చంద్రం! డాక్టరుగారు వస్తున్నారు. వెళ్లి బ్యాగు అందుకో" అని కేకవేసి లోపలి గదిలోకి నడిచింది.

పెద్దగది. మధ్యలో మంచం. ఓ పక్కగా కుర్చీలు. కొంచెం దూరంగా ఎత్తుగా బల్ల. దానిమీద మందు సీసాలు, పళ్లు. గది గుమ్మానికి కిటికీలకి రంగుల పరదాలు-నిశ్శబ్దం...

"డాక్టరుగారు వస్తున్నారు. మీరింక గాభరాపడకండి ఈ విషయం ఆయనతో సూటిగా అడిగి కనుక్కుంటాను." అంటూ కావేరి భర్త పక్కన వచ్చి కూర్చుంది. ఆమె ముఖంలో ఆందోళన, విచారం ప్రస్ఫుటమవుతున్నాయి. అతని నుదుటి మీద చేయి వేసింది.

అతను కళ్లు తెరిచాడు. కావేరి చేతిని ఆప్యాయంగా తడిమి తలమీంచి తీసి దిండుమీద పెట్టాడు.

"నీ వెర్రిగానీ కావేరీ, డాక్టరు వచ్చినంతమాత్రాన నా బాధలు తగ్గుతాయా?" నెమ్మదిగా అడిగాడు.

"పెయిన్ కిల్లర్స్ ఇస్తాడు, లేదా ఇంజక్షను యిస్తాడు. మీరిలా ధైర్యం పోగొట్టుకుంటే ఎలా? ఈ రోజుల్లో మంచి డాక్టర్లకి ట్రీట్‌మెంటుకీ తక్కువేమిటి?"

ఇలా అంటుండగానే కావేరికి ఒక్కుమ్మడిగా దగ్గు వచ్చింది. కొంగు ముఖానికి అడ్డం పెట్టుకుని తల పక్కకి తిప్పుకుంది. భర్త ఆమె మాటలకోసం, ఓదార్పు కోసం ఎదురుచూడడంలేదు. గది సీలింగు వంక నిశ్చలంగా చూస్తున్నాడు.

> జీవితానికి ధ్యేయం ఏమిటి? కేవలం ధనార్జనేనా? డబ్బుతోనే అన్ని సుఖ సంతోషాలూ లభిస్తాయా? మనసు కోరుకునే చల్లని అనుభూతులకు—సమాధానాన్ని అన్వేషించే ప్రయత్నంలో, డబ్బు ఎంత వరకూ సహాయపడుతుంది?

కారు ఆగిన చప్పుడు. నౌకరు బ్యాగు అందుకోగా డాక్టరు గదిలోకి ప్రవేశించాడు. రోగిని శ్రద్ధగా పరీక్షించాడు. కావేరి ఆయన ముఖంలోకి చూస్తూ బైటికి నడిచింది.

నౌఖరు చంద్రం రోగి దగ్గరకి వచ్చి చేతులు కట్టుకుని నిలబడ్డాడు. రోగి అతనివంక చూసి "చంద్రం! కొంచెం దిండుకానించి నన్ను కూర్చోబెట్టు. ఆ కిటికీ తలుపులు తెరిచి, పరదా పక్కకి నెట్టు." అన్నాడు. చంద్రం యజమానిని కూర్చోబెట్టి కిటికీలు తెరిచాడు. కావేరి లోపలికి ప్రవేశించి నిట్టూర్పుతో భర్తవంక చూసింది.

"గాభరా పడవలసిందేమీ లేదు. ఇవాళ నుంచి నైట్ నర్సుని ఏర్పాటుచేస్తున్నారు. అవసరమైతే విదేశం పంపే ఏర్పాట్లు..."

కావేరి మాట నోటిలోనే నిలిచిపోయింది. 'ఉష్' అని వారిస్తున్నట్లు భర్త చేయివిదిలించాడు.

'అబ్బ! చాలు కావేరీ! ఈ విషయం గురించి మాట్లాడటం కాసేపు మానేద్దాం. నాకు తెలును నువ్వు ఎంత ఆదుర్దాపడుతున్నావో! కానీ నాకు చాలా విసుగ్గా వుంది. ఈ మాటలతో ఊపిరి ఆడటం లేదు... అరె! అటుచూడు. ఆ మామిడి కొమ్మమీద రంగుల పక్షి. దాని పేరేమిటి? అరెరె! జ్ఞాపకం రావటంలేదు..." అంటూ కిటికీ వంక ఆసక్తిగా చూశాడు. కావేరి కూడా తలతిప్పి అటు చూచింది. కిటికీ తలుపుల వెనక పచ్చని చెట్టుకొమ్మ. కొమ్మమీద రంగుల పక్షి. ఆ వెనకగా మైదానం... ఆకాశం.. కలత చెందిన కావేరి మనసుని ఏవో జ్ఞాపకాలు బలంగా గుచ్చుకున్నాయి.

* * *

ఆవి కావేరికి పెళ్లి అయిన కొత్త రోజులు. పెద్దలు నిశ్చయించిన సంబంధమైనా, చలపతి కావేరికి నచ్చాడు. అత్తగారివైపు ఎక్కువమంది లేరు. పెళ్లయిన ఒక ఆడపడుచు, విదేశంలో స్థిరపడిన ఒక బావగారు. అత్తమామలిద్దరూ దూరంగా పల్లెలో వుండేవారు. అప్పుడప్పుడు కొడుకు యింటికి వచ్చినా, వారికి పట్నం రుచించేది కాదు.

చలపతికి ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం. మంచి జీతం. సొంతఇల్లు. కావేరికి ఆ రోజులు గాలిలో తేలినట్లే వుండేవి. వయసొచ్చినప్పటినుంచీ కావేరికి చీరలు, నగల మోజు. షికార్లకి తిరగటమన్నా కొత్త ప్రదేశాలు చూడటమన్నా సరదా. ఇవన్నీ పుట్టింట్లో సాగాయని కాదు. నెలకి ఓ మాటు షికారుగా అలా వెళ్లినా, కూల్‌డ్రింక్ తాగాలనీ, ఐస్‌క్రీమ్ తినాలనీ అనిపించేది.

సినిమాకి తరుచు వెళ్లకపోయినా ఆ వెళ్లినప్పుడు డ్రెస్ సర్కిల్‌లో కూర్చోవటానికి ఇష్టపడేది. అలాగే రైలు ఎక్కినా, బస్సులో కూర్చున్నా రద్దీ లేకపోతే ఆనందించేది.

ఇరవైనిండగానే పెళ్లయిన కావేరితో బాటు ఈ ఆశలు, సరదాలు అత్తవారింటికి వెళ్లాయి. అందుకనే మొదటిసారి చలపతి "ఎందుకివన్నీ దండగ! డబ్బు వేస్టు!" అన్నప్పుడు షాక్ తిన్నట్లు భర్తవంకచూసింది. నిజానికి చలపతి ఏమీ వయసుమీరిన వాడు కాదు. పాతికేళ్లు నిండాయి అంతే. ఆశలు, సరదాలు తక్కువేం కాదు. కానీ, అతని ఆలోచనలు వేరు, అతని ధోరణి వేరు. "రేపు మనకి సంసారం అంటూ ఏర్పడితే డబ్బు అవసరం" అని గంభీరంగా చలపతి అంటుంటే కావేరికి గొంతులో ఐస్‌క్రీం అడ్డుకున్నట్లయింది. ప్రయాణం తలపెడితే మూడో తరగతి అనేవాడు. దుకాణంలో అడుగుపెడితే తక్కువ ధర కోసం అతని కళ్లు వెతికేవి. ఏదయినా కొనటం ముగించాక చిల్లర డబ్బులు జాగ్రత్తగా లెక్క చూసుకుని జేబులో వేసుకునే వాడు.

కావేరి మానసికంగా అతనికి దూరం కాసాగింది. రెండేళ్లు గడిచాయి. కొడుకు పుట్టాడు. ఇటు అత్తవారింటివైపు, అటు పుట్టింటివైపు వారు సంతోషంతో పొంగిపోయారు. పిల్లవాడి పోషణలో కావేరి కొన్ని విషయాలు పట్టించుకోవటం మానేసింది. రెండో పిల్ల ఒళ్లో చేరేటప్పటికి కావేరికి ఆ జీవితం చాలా మటుకు అలవాటయిపోయింది. పిల్లల పెంపకం, చదువుసంధ్యలు వారి భవిష్యత్తు గురించి ఆలోచిస్తే కావేరి మనసుకూడా చలపతి ఆలోచనలవైపు ఆకర్షితమయింది. 'రేపటికంటూ వెనకేసుకోకపోతే ఎలా? అనవసరపుఖర్చు మానేయాలి' అనే భావన ఆమెలో కూడా కలిగింది.

* * *

రోజులు గడుస్తున్నాయి. చలపతి ఉద్యోగం హోదా పెరిగింది. డబ్బు జాగ్రత్తగా వాడమని కావేరిని హెచ్చరిస్తూనే వున్నాడు. కనీసపు అవసరాలు మినహా 'సరదాలు' అనేవి కావేరి జీవితంలో 'విలాసాలు' గానే మిగిలిపోయాయి. ఆమె ఆశలు, కోరికలు అటువంటి జీవితానికి 'కండిషన్' అయ్యాయి. చలపతి డబ్బు వెనకేస్తున్నాడు. ఆ వివరాలు అతను అప్పుడప్పుడు చెబుతుంటే కావేరి పరధ్యానంగా "ఊ" కొడుతూ వినేది. ఒకరోజు చలపతి ఇలా అన్నాడు. "చూడు కావేరీ! ఈ రోజు నా బ్యాంకు బాలెన్సు ఇంత అయిందంటే దానికి నీ సహకారం చాలా వుంది." ఆ మాటలకి కావేరి పొంగిపోయింది.

"అది సరే... కానీండి పిల్లలు మీ అక్కగారింటికి సెలవులకని వెళ్లారు కదా! మనం ఉత్తరదేశం వైపు—అదే చల్లని ప్రాంతం వైపు—ఓ మాటు వెళదామండీ" అంది బేలగా.

"అదిగో చూశావా? అదే నేనూ ఆలోచిస్తున్నది. ఇంకొంచెం ఓపిక పట్టు. నాకు ఈ ఆఫీసువనీ అదీ పూర్తవనీ. రిటైరయ్యాక ఇద్దరం తృప్తిగా తిరుగుదాం. అటు కాశ్మీరు, సిమ్లా ఇటు కొడైకెనాల్, కన్యాకుమారి...

కావేరి పెద్దగా నిట్టూర్చి అక్కణ్ణించి లేచి వెళ్లిపోయింది.

ఇది మొదటిసారి కాదు. అంతకుముసుపు కూడా కావేరి భావాలని తక్కువ త్రుంచేసేవాడు భర్త. విశ్రాంతి, వినోదం మిళితమైన ఏ కార్యక్రమం పట్ల అయినా సరే విముఖత చూపేవాడు. అలాటి చోట్లకి వెళ్లటంలోని ఆనందం, అవసరం గ్రహించేవాడు కాదు. వాయిదా వేసేవాడు. జీవితంలో వేయవలసిన ప్రతి అడుగుకీ ఒక క్రమం, పద్ధతి కావాలి అతనికి.

ఒకమాటు చలపతి ఇలా అన్నాడు. "ఎంతసేపూ పిల్లలు, పిల్లలు అంటూ తపన పడతావు. రేపు మన గతేమిటి అని ఎన్నడైనా ఆలోచించావా?" కావేరి అర్థం కానట్లు భర్తవంక చూసింది. "వీళ్లు పెద్దవాళ్లవుతారు రెక్కలు రాగానే వాళ్ల జీవితాలు వాళ్లు దిద్దుకుంటారు. మన సంగతో? ఈ రోజుమనకున్న..." కావేరి అతని మాటలు పూర్తిగా వినలేదు. మనసు ఏదో వెలితిగా, బాధగా అనిపించింది.

ముప్పై సంవత్సరాలన్నా నిండని కావేరి—భవిష్యత్తు గురించి చలపతిలా ఆలోచించటం లేదు. పిల్లలు, వాళ్ల భవిష్యత్తు—అక్కడే ఆమె ఆలోచనలు నిలిచిపోయాయి. చలపతి మాటల్లో తప్పక నిజం వుండి వుండవచ్చు అనుకుంది. కానీ దాన్ని గురించి ఆలోచించటంగానీ, వాస్తవమని అంగీకరించటం గానీ చేయలేకపోయింది. భర్తకున్న అభిప్రాయాలలో యిదో కొత్తరకంది అనుకుంది.

ఆ రాత్రి కావేరి కలతగానే నిద్రపోయింది. వృద్ధాప్యంలో అడుగుపెట్టిన తన తల్లితండ్రులు, అత్తమామలు యింకా ఎందరో దయనీయంగా ఆమె ముందు నిలిచారు. వాళ్లల్లో ఎవరూ సుఖపడుతున్నట్లు ఆమెకి అనిపించలేదు. వాళ్లందరికీ డబ్బు కష్టమా? అనే భయంకర సంశయం కలగగానే కావేరికి ముచ్చెమటలు పోశాయి.

ఒకరోజు చలపతి బోధించాడు. "వయసు పై బడ్డాక మనకంటూ డబ్బు వుండాలి. ఒకరిమీద ఆధారపడకుండా హాయిగా స్వతంత్రంగా జీవించాలి. డబ్బు అవసరం ఇప్పుడు కాదు. అప్పుడు తెలిసి వస్తుంది. మందులు మాకులు... డాక్టరు బిల్లులు, నౌకర్లు..." కావేరి అతని మాటలకి అడ్డు తగిలింది.

"అదేమిటండీ, అలా అంటారు? వయసు మీరాక అవసరమయ్యేది మనిషి సహాయం" అంది.

"దానికర్థమేమిటో చెప్పు... కాస్త వింటాను." భర్త ఆమె ముఖంలోకి సూటిగా చూశాడు.

"ఈ పిల్లలు, బంధువులు, పరిచయస్తులు నిన్నూ నన్నూ వచ్చి ఆదుకుంటారా? అలాటి పిచ్చి ఆశలు పెట్టుకోకు, ఎవరూ మన ముఖం చూడరు. సరికదా కార్డుముక్క రాస్తే జవాబు ఇవ్వరు. అప్పుడు మనకి కావలసింది డబ్బు సహాయం. అదే వృద్ధాప్యంలో ఆదుకునేది. డబ్బులేకపోతే విశ్రాంతి, నౌకర్లు, సుఖప్రయాణం, వైద్యసహాయం ఏవీ దొరకవు. ఆఖరి రోజులు దైన్యంగా దుర్భరంగా సాగించవలసి వస్తుంది..." అని నచ్చచెప్పాడు.

* * *

ఈ రోజు కావేరికి నిజంగా పిల్లల అవసరంలేదు. రెక్కలు వచ్చి జీవితంలో స్థిరపడి ఎవరి జీవితం వారు గడుపుకుంటున్నారు. స్నేహితులకీ, బంధువులకీ సహాయార్థం కార్డు ముక్కరాయవలసిన అవసరం అసలులేదు. ఆరోజు భర్తచెప్పిన విశ్రాంతి, నౌకర్లు, స్వతంత్రం వున్నాయి. జీవితం దైన్యంగా, దుర్భరంగా సాగటంలేదు. కానీ... కానీ... 'కావేరీ... కావేరీ' అన్న భర్త పిలుపు విని తేరుకుని అతని మంచందగ్గరకి వెళ్లింది. "చూడు కావేరీ! నాకు ఓ విషయం తడుతోంది. చెప్పనా?..." అని అడిగాడు. మంచంమీద కూర్చుంటూ అతని చేతిని తనచేతిలోకి తీసుకుంది కావేరి.

"కావేరీ! మన జీవితం హాయిగా, ఒడిదుడుకులు లేకుండా సాగిపోయింది కదూ?"

'ఔ'నన్నట్లు తలవూపింది.

"రిగ్రెట్స్ ఏమైనా వున్నాయా?"

కావేరి ముఖంలోకి గుచ్చి చూశాడు చలపతి. "లేవు ఎందుకుండాలి? పిల్లలు హాయిగా సెటిల్ అయ్యారు దేనికీ కొరత లేకుండా జీవిస్తున్నాము..." కావేరి ఆగింది.

"కానీ... కావేరీ నాకు వున్నాయి. "చలపతి ఆమె నుంచి కళ్లు తిప్పుకుని కిటికీవైపు చూశాడు.

"డబ్బు సంపాయించాలి... కూడబెట్టాలి... అనే ప్రయత్నంలో మనం కొన్ని విషయాల్ని మరచిపోయాము. కొన్ని ఆసలు వున్నాయనే విషయం స్ఫురించలేదు. చిన్న చిన్న విషయాలే అయినా, కొన్నిటిని వయసుతోపాటు పోగొట్టుకున్నాము. ఇప్పుడవి ఎదురయినా అనుభవించే శక్తి, ఆసక్తి మనకి లేవు. డబ్బు సహాయంతో ఏర్పరచుకున్న సుఖజీవనం చేదుగా తయారయింది. కనుచూపుమేర మనకి ఎదురయ్యేవి—మందులు, రోగాలు, నౌకర్లు, ఒంటరితనం తప్ప ఇంకేం మిగిలాయి కనుక? ఈ శరీరంమీద ఎంత మమకారం మనకి... కావేరీ! నీకు అన్యాయం చేశాను. వయసుకి తగ్గ సుఖసంతోషాలు లేకుండా చేశాను..." కావేరి కొంగు ముఖానికి అడ్డం పెట్టుకుని ఏడవసాగింది.

"అలా అనకండి. నాకు మీరేం తక్కువ చేయలేదు. ముందు ఆరోగ్యం బాగుచేసుకోండి."

"ఒద్దు కావేరీ!... నాకు ఈ ట్రీటమెంటు, ఈ రకం జీవితమంటే వినుగుపుడుతోంది. అలా ఏడవకు... పిచ్చి దానా! అన్నీ పోగొట్టుకున్నాను అనలేదు. ఇంకా ఎంతో వ్యవధి వుంది. ఎన్నో చేయవలసినవి మిగిలి వున్నాయి. పిల్లలకి టెలిగ్రాం ఇప్పించు. వాళ్లకి ఇవ్వవలసింది, చెప్పవలసింది చాలా వుంది..." అంటూ చలపతి లేచి కూర్చోబోయాడు.